క్లుప్తంగా

కరపత్రాల ఆవిష్కరణ

కడప వైఎస్సార్ సర్కిల్ : జిల్లాలోని రైతాంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంవి సుబ్బారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో జనవరి 6,7 తేదీల్లో ఎర్రగుంట్లలో జరిగే ఏపీ రైతు సంఘం జిల్లా మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని రైతులు కరువు, తుఫాను వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రైతులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి భాస్కర్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

రేపు మెగా రక్తదాన శిబిరం

వైవీయూ : కడప నగరంలోని డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో ఈనెల 21వ తేదీన మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య బి. అంజనేయప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి. సురేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. విశ్వవిద్యాలయ వ్యవస్థాపకులు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో విశ్వవిద్యాలయ అధ్యాపకులు, విద్యార్థులు రక్తదాన కార్యక్రమంలో పాల్గొననున్నట్లు తెలిపారు.

చిత్రపటాల ఆవిష్కరణ

వైవీయూ : స్వాతంత్ర్య సమరయోధులు పండిత్ రాంప్రసాద్ బిస్మల్, అష్ఫాఖుల్లా ఖాన్‌ల చిత్రపటాలను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి టి.కె. అఫ్జల్‌ఖాన్ ఆవిష్కరించారు. మంగళవారం కడప నగరంలో జేకే యూత్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు పి. ఖాదర్‌బాషా ఆధ్వర్యంలో చిత్రపటాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అఫ్జల్‌ఖాన్ మాట్లాడుతూ దేశం కోసం ప్రాణత్యాగం చేసిన సమరయోధుల జీవితం మనందరికీ ఆదర్శమన్నారు. కార్యక్రమంలో సలీం తదితరులు పాల్గొన్నారు.

వైవీయూ ఆర్ట్స్‌బ్లాక్ తనిఖీ

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం ఆర్ట్స్ బ్లాక్‌లోని పలు విభాగాలను వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, పరిశోధకుల హాజరును పరిశీలించారు. సెలవులో ఉన్నవారి అనుమతి పత్రాలను పరిశీలించారు. కొన్ని శాఖల్లో రికార్డుల నిర్వహణపై వీసీ అసంతృప్తి వ్యక్తం చేశారు. రికార్డుల నిర్వహణ సరిగాలేని శాఖల సిబ్బందిని, విభాగాధిపతులను ప్రశ్నించారు. ఇలాగే కొనసాగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థులు ఎక్కువగా గైర్హాజరైతే పరీక్షలకు అనుమతించవద్దని సూచించారు. అనంతరం సైన్స్, ఆర్ట్స్, మేనేజ్‌మెంట్ విభాగాల హెడ్‌లతో సమావేశం నిర్వహించి అకాడమిక్ అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి, పలు విభాగాల అధ్యాపకులు పాల్గొన్నారు.

అర్హులకు జలకళ అమలు చేయాలి

కడప వైఎస్సార్ సర్కిల్ : జిల్లాలో అర్హులైన రైతులకు జలకళ పథకం అమలు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.దస్తగిరి రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జలకళ పథకం కింద రాజకీయ పలుకుబడి ఉన్న వారికి మాత్రమే జిల్లా ఉన్నతాధికారులు బోర్లు వేస్తున్నారని ఆరోపించారు. అర్హులైన పేద రైతులకు వర్తింపజేయాలన్నారు.

సెల్ఫ్‌సెంటర్‌లను రద్దు చేయాలి

వైవీయూ : వైవీయూ పరిధిలో నిర్వహించనున్న డిగ్రీ పరీక్షలకు సంబంధించి సెల్ఫ్‌సెంటర్‌లను రద్దు చేయాలని రాయలసీమ స్టూడెంట్ ఆర్గనైజేషన్స్ నాయకులు కోరారు. మంగళవారం విశ్వవిద్యాలయంలో వీసీ ఆచార్య చింతా సుధాకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జగన్ మాట్లాడుతూ జిల్లాలో పలుచోట్ల నిబంధనలకు విరుద్ధంగా, కనీస వసతులు లేకుండా తరగతులు నిర్వహిస్తున్నారన్నారు. అదే విధంగా సెల్ఫ్‌సెంటర్ పేరు చెప్పి విద్యార్థుల నుంచి యాజమాన్యాలు వసూళ్లకు పాల్పడుతున్నారని తెలిపారు. వైవీయూ పరిధిలో అక్రమాలకు పాల్పడే సెల్ఫ్‌సెంటర్‌లను రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగంపై అవగాహన

కడప సెవెన్‌రోడ్స్ : బహుజన మేలుకో...రాజ్యాంగాన్ని తెలుసుకో అనే కరపత్రాల ద్వారా ఏపీ దళిత మిత్ర సంఘం ఇంటింటి ప్రచార అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టింది. కడప నగరం అంబేద్కర్ నగర్ దండోరా కాలనీలో ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు కె.రామాంజనేయులు, మూడవ డివిజన్ అధ్యక్షులు ఎం.శ్రీనివాసులు కార్యక్రమాన్ని ప్రారంభించారు. బడుగు, బలహీన వర్గాల ప్రజలకు రాజ్యాంగం, హక్కుల పట్ల అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టామని వారన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేస్తున్నామని వివరించారు.

ఆర్బీకే తనిఖీ

సిద్దవటం : మండలంలోని మాచుపల్లి రైతు భరోసా కేంద్రాన్ని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసినట్టు బద్వేల్ సహాయ వ్యవసాయ సంచాలకులు మర్రిపాటి నాగరాజ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఈ - పంట నమోదు ప్రక్రియలో పాల్గొన్నారు. తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర వ్యవసాయ కళాశాలకు చెందిన బీఎస్సీ అగ్రికల్చర్ ఫైనలియర్ విద్యార్థులతో ముఖాముఖిలో పాల్గొని వారికి వ్యవసాయ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆర్బీకేలో యూరియా నిల్వలను పరిశీలించారు. తదనంతరం ఆయన మాట్లాడుతూ యూరియా 77 బస్తాలున్నాయని, బస్తా ధర రూ. 267.50 అవసరమైన రైతులు కొనుగోలు చేయాలన్నారు.

ఉజ్వల భవిష్యత్‌కు

జగనన్న మళ్లీ రావాలి

కడప కార్పొరేషన్ : రేపటి తరం ఉజ్వల భవిష్యత్ కోసం జగనన్న మళ్లీ సీఎం కావాల్సిన అవసరముందని జేసీఎస్ అధ్యక్షుడు తోటక్రిష్ణ, కన్వీనర్ మల్లికార్జున, 5వ డివిజన్ ఇన్‌చార్జి బండి ప్రసాద్ అన్నారు. మంగళవారం స్థానిక అశోక్ నగర్‌లో 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై ప్రభుత్వ సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించి, వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వార్డు సచివాలయ వ్యవస్థతో యావత్ భారతదేశం స్ఫూర్తి పొందిందన్నారు. పేద బిడ్డల చదువులే ఆస్తిగా భావించి అమ్మ ఒడి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని, వృద్ధులకు ప్రతి నెలా ఒకటో తేదీనే తలుపుతట్టి ఠంఛన్‌గా పింఛన్ అందజేస్తున్నారన్నారు. కడప నగరంలో కనీ, వినీ ఎరుగని విధంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయంటే సీఎం మన జిల్లా వాసి కావడమే కారణమన్నారు. ఈ అభివృద్ధి, సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగనన్న మళ్లీ సీఎంగా రావాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్ కుమార్, ఆర్ఐ విశ్వనాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు మదన్‌మోహన్‌రెడ్డి, బండి ఉమ తదితరులు పాల్గొన్నారు.



5వ డివిజన్ అశోక్ నగర్‌లో వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మాసాపేటలో....

26వ డివిజన్‌లోని మాసాపేటలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్ కుమార్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్ కుమార్, జేసీఎస్ అధ్యక్షుడు తోటక్రిష్ణ, డివిజన్ ఇన్‌చార్జి త్యాగరాజు, పి. సంపత్, చైతల్య తదితరులు హాజరయ్యారు. ముందుగా వారు ప్రభుత్వ సంక్షేమ పథకాల డిజిటల్ బోర్డును ఆవిష్కరించారు. వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి 'ఆంధ్రాకు జగనే ఎందుకు కావాలంటే' బుక్‌లెట్లు అందజేసి సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చెన్నయ్య, గౌస్‌పీర్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

మైదుకూరు జూనియర్ సివిల్ జడ్జి ఖాజా మొహిద్దీన్

చాపాడు : ప్రజలందరూ న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని మైదుకూరు జూనియర్ సివిల్ జడ్జి ఖాజా మొహిద్దీన్ పేర్కొన్నారు. మండలంలోని కేతవరం గ్రామంలో మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని తద్వారా అన్యాయం జరిగినప్పుడు న్యాయం పొందాలన్నారు. పుట్టబోయే బిడ్డ నుంచి మృతి చెందే వరకూ ప్రతి ఒక్కరికీ చట్టాలు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ సందర్భంగా న్యాయవాదులు పలు చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మైనుద్దీన్, ఆర్ఐ ప్రవీణ్, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ నారాయణరెడ్డి, పీపీ జ్వాలా నరసింహ శర్మ, ఎక్స్ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్రీనివాసులు, సీనియర్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.



న్యాయ సేవలపై అవగాహన కల్పిస్తున్న జడ్జి ఖాజా మొహిద్దీన్

పోరాటాలకు సిద్ధం కావాలి



సభలో మాట్లాడుతున్న వినోద్‌కుమార్

పోరుమామిళ్ల : విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం విద్యార్థులు మరిన్ని పోరాటాలకు సిద్ధం కావాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు వినోద్‌కుమార్, జిల్లా కార్యదర్శి రాజేంద్రప్రసాద్ పిలుపునిచ్చారు. పోరుమామిళ్లలో జరుగుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం కార్పొరేట్ విద్యావ్యవస్థను పోషిస్తూ, ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు. చదువుకున్న అందరికీ ప్రభుత్వం ఉపాధి కల్పించాలన్నారు. మహాసభలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సునీల్‌కుమార్, ఉపాధ్యక్షులు రాహుల్, నాయక్, వినయ్, సహాయ కార్యదర్శి రవి, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి

పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి

పులివెందుల టౌన్ : పులివెందుల మోడల్ టౌన్‌లో భాగంగా జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణంలోని సెంట్రల్ బోలేవార్డు పనులు, నిర్మాణంలో ఉన్న మెడికల్ కళాశాల, షాపింగ్ కాంప్లెక్స్ తదితర పనులను మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డిలతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అభివృద్ధి పనుల పురోగతిపై వారితో చర్చించి మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పులివెందుల పర్యటనకు వచ్చే రెండు రోజుల ముందే సదరు పనులను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, తదితరులు

మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులకు అవార్డులు



ఆయేషా, వందనకు పురస్కారాలను అందజేస్తున్న కళాశాల విద్య కమిషనర్ పోలా భాస్కర్

వైవీయూ : కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు రాష్ట్రస్థాయి పురస్కారాలు లభించాయి. మంగళవారం అనంతపురం నగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఆన్యువల్ ఫెస్ట్-23 కార్యక్రమంలో రాష్ట్రస్థాయి ఎన్‌సీసీలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన కడప కోటిరెడ్డి మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థిని ఎస్. ఆయేషా, ఎన్ఎస్ఎస్‌లో జాతీయస్థాయిలో రాణించి, స్టేట్ బెస్ట్ ఎన్ఎస్ఎస్ వలంటీర్ అవార్డుకు ఎంపికైన ఎస్.వందనకు కళాశాల విద్య కమిషనర్ డా. పోలా భాస్కర్ చేతుల మీదుగా పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎరువుల షాపు తనిఖీ

వైవీయూ : కడప నగరం పాతబస్టాండు సమీపంలోని రైతు డిపో ఎరువుల షాపును బద్వేలు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.నాగరాజు మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రిజిష్టర్‌లను, రశీదులు, ఇన్వాయిస్‌లు, బస్తాతూకం, లైసెన్స్‌గడువు వంటి అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు చేసిన ప్రతి రైతుకు రశీదు ఇవ్వాలన్నారు. రైతుసంతకం, మొబైల్ నెంబర్ సేకరించాలని, నాణ్యమైన ఎరువులను మాత్రమే అమ్మాలని, తడిసిన, గడ్డకట్టిన ఎరువులను ఎట్టిపరిస్థితుల్లో అమ్మరాదన్నారు. గరిష్ట అమ్మకం ధరకు మించి అమ్మరాదన్నారు. రైతుకు అవసరమైన ఎరువులను తప్ప వేరే ఎరువులను లింక్ చేయరాదన్నారు. కొనుగోలు సమయంలో ఎరువుల వాడకంపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో కడప మండల వ్యవసాయ అధికారి ఎస్.వి. సురేష్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.



ఎరువుల షాపును తనిఖీ చేస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

లైంగిక వేధింపుల నివారణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అకడమిక్ డీన్ రత్నకుమారి

వేంపల్లె : ఇడుపులపాయ ఆర్‌కే వ్యాలీ ట్రిపుల్ ఐటీలో మంగళవారం లైంగిక వేధింపుల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ట్రిపుల్ ఐటీలో మహిళలు, పిల్లలపై జరిగే అఘాయిత్యాలు, వాటిని నిరోధించేందుకు చట్టపరమైన చర్యల గురించి విద్యార్థినులకు వివరించారు. చట్టపరంగా తమకున్న హక్కులపై అవగాహన లేని కారణంగా ఎంతోమంది మహిళలు అనేక రకాలుగా హింసను మౌనంగా భరిస్తున్నట్లు వెల్లడించారు. మహిళలకు రక్షణ కోసం కల్పించిన వివిధ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని కోరారు. కార్యక్రమంలో అకడమిక్ డీన్ రత్నకుమారి, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అష్ఫాఖుల్లాఖాన్ సేవలు మరువలేనివి

కడప వైఎస్సార్ సర్కిల్ : దేశ స్వాతంత్ర్య సమరయోధుడు అష్ఫాఖుల్లాఖాన్ సేవలు మరువలేనవని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర కొనియాడారు. మంగళవారం నగరంలోని హోచిమన్ భవన్‌లో ఇన్సాఫ్ ఆధ్వర్యంలో అష్ఫాఖుల్లాఖాన్, రామ్ ప్రసాద్ భీస్మిల్ వర్ధంతి సందర్భంగా వారి చిత్ర పటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సుబ్బారెడ్డి, సీపీఐ జిల్లా సమితి సభ్యులు సావంత్ సుధాకర్, ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షులు కేసీ.బాదుల్లా, సహాయ కార్యదర్శి యస్. గౌస్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆప్‌కీ ఆవాజ్ ఆధ్వర్యంలో......

ఆప్‌కీ ఆవాజ్ ఆధ్వర్యంలో నగరంలోని ఆ సంఘ కార్యాలయంలో అష్ఫాఖుల్లాఖాన్, రామ్ ప్రసాద్ భీస్మిల్ వర్ధంతి సందర్భంగా వారి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆప్‌కీ ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి మగ్బూల్ బాష తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాలను అరికట్టండి

గోపవరం : విధి నిర్వహణలో నిర్లక్ష్యాన్ని వీడి విద్యుత్ ప్రమాదాలను అరికట్టాలని జిల్లా విద్యుత్‌శాఖ అధికారి (ఏపీఎస్‌పీడీసీఎల్ ఎస్ఈ) ఎస్.రమణ పేర్కొన్నారు. మంగళవారం బద్వేలులోని విద్యుత్ కార్యాలయంలో క్షేత్రస్థాయి సిబ్బంది, అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయానికి సంబంధించిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఫీజులు, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు మార్చడం వంటి పనులపై వెంటనే స్పందించాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యుత్ అంతరాయాలు లేకుండా చూసుకోవాలన్నారు. ఇంకా పలు విషయాలపై సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. సమావేశంలో బద్వేలు డీఏఈ కుళాయప్ప, జూనియర్ అకౌంట్ ఆఫీసర్ జయప్ప, ఏఈలు చిన్నయ్య, షర్మిల, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు విద్యార్థుల ఎంపిక



విద్యార్థిని సత్కరిస్తున్న పొలతల చైర్మన్ నాగమల్లారెడ్డి

పెండ్లిమర్రి : గంగనపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్‌లో చదువుతున్న విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపిక కావడం అభినందనీయమని పొలతల దేవస్థాన చైర్మన్ నాగమల్లారెడ్డి అన్నారు. మంగళవారం గంగనపల్లె హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి క్రీడా పోటీలకు ఎంపికైన విద్యార్థులను సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సావిత్రిదేవి, వ్యాయామ ఉపాధ్యాయుడు శివశంకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముక్కోటి ఏకాదశికి ఘనంగా ఏర్పాట్లు

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి దేవాలయంలో ఈ నెల 23(శనివారం) ముక్కోటి ఏకాదశికి వైకుంఠాన్ని తలపించేలా ఏర్పాట్లు ఉంటాయని నిర్వాహకులు పెన్నపేరూరు ఎంపీటీసీ ముమ్మడి నారాయణరెడ్డి, పసుపులేటి సుబ్బరాయుడు అన్నారు. మంగళవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ వైష్ణవ ఆలయం అయిన ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయాన్ని ముక్కోటి ఏకాదశి నాడు సుందరంగా అలంకరించనున్నట్లు తెలిపారు. పుష్పాలంకరణకు ఎంఆర్‌కేఆర్ కన్స్ట్రక్షన్స్ యజమానులు రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, మేడా రఘునాథరెడ్డి, మేడా మధుసూదన్‌రెడ్డి సహకారంతో సుమారు రూ. 3లక్షల 50 వేలు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. అలాగే ముక్కోటి ఏకాదశి నాడు వచ్చే భక్తులకు ప్రత్యేకంగా అన్నప్రసాదాలు కూడా పంపిణీ చేస్తామన్నారు. ఏర్పాట్లకు ముందుకొచ్చిన మేడా సోదరులకు నాయకులు కృతజ్ఞతలు తెలియజేశారు.

సమయాన్ని సద్వినియోగం చేసుకుంటేనే విజయం



మాట్లాడుతున్న ఉత్తమ్‌రెడ్డి

కడప కల్చరల్ : సమయాన్ని సద్వినియోగం చేసుకుంటేనే పోటీ పరీక్షలు రాసే అభ్యర్థులకు విజయం సులభసాధ్యమవుతుందని టర్నింగ్ పాయింట్ కోచింగ్ సెంటర్ డైరెక్టర్ జి.ఉత్తమ్‌రెడ్డి అన్నారు. సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో మంగళవారం గ్రూప్స్‌కు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఉపయోగపడే వివిధ అంశాలపై జి.ఉత్తమ్‌రెడ్డి అవగాహన కల్పిస్తూ ప్రసంగించారు. పోటీ పరీక్షలు రాసే అభ్యర్థులు సిలబస్, ప్రిలిమ్స్ ఎలా క్వాలిఫై కావాలో వివరించారు. ఏ సబ్జెక్టుపై పట్టు సాధించాలి? చదివేందుకు తగిన సమయాన్ని ఎలా కేటాయించాలి? రోజుకు ఎన్ని గంటలు చదవాలి? సిలబస్ ఎన్ని రోజుల్లో పూర్తి చేయాలి? మోడల్ పరీక్షలు రాయడం వల్ల కలిగే లాభాలు? ఏయే పుస్తకాలు చదవాలి, కరెంట్ అఫైర్స్‌ను ప్రత్యేకంగా ఎందుకు చదవాలి? మోటివేషన్ కాంపిటేటివ్ పరీక్షల మెళకువలు తదితర అంశాల గురించి విశ్లేషణాత్మకంగా వివరించారు. కార్యక్రమం ప్రారంభంలో బ్రౌన్ కేంద్రం సంచాలకులు ఆచార్య టి.రామప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రానికి ఉద్యోగాన్వేషణలో భాగంగా పలువురు అభ్యర్థులు వస్తారని, అలాంటి వారికి పుస్తకాలు తెప్పించడమే కాకుండా ఇంటర్నెట్ సదుపాయం గల కంప్యూటర్‌ను కూడా అందుబాటులో ఉంచామన్నారు. కార్యక్రమంలో గ్రూప్స్‌కు సిద్ధమవుతున్న అభ్యర్థులు పాల్గొన్నారు.

ముందస్తు వేడుకలు



ముందస్తు క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న పాస్టర్లు, దైవ సేవకులు, బాప్టిస్ట్ సంఘ పెద్దలు

కడప కల్చరల్ : కడప నగరం తిలక్‌నగర్‌లోని బాప్టిస్ట్ చర్చిలో మంగళవారం చర్చి 19వ వార్షికోత్సవం, సెమీ క్రిస్మస్ వేడుకలను ఉమ్మడిగా నిర్వహించారు. ఈ సందర్భంగా దైవ జనులు డాక్టర్ బి.సుధీర్ క్రిస్మస్ సందేశాన్ని అందజేశారు. అనంతరం స్థానిక సంఘ కాపరి డాక్టర్ ప్రసాద్‌రావు, అధ్యక్షులు ప్రకాశ్‌రాజు చర్చి రూపొందించిన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. చర్చి యూత్ ఏర్పాటు చేసిన భారీ క్రిస్మస్ కేకును కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. పాస్టర్ అనిల్‌కుమార్ ఆరాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం విశ్వాసులంతా క్యాండిల్ సర్వీసు చేపట్టారు.

మోతాదు మించి మందులు వాడరాదు

జమ్మలమడుగు రూరల్ (మైలవరం) : మిరప పంట సాగులో మోతాదుకు మించి మందులు వాడరాదని ఆర్‌బీకే వీహెచ్ఏ ఎం.తిరుమలేశ్ తెలిపారు. మంగళవారం మైలవరం మండలంలోని పొన్నంపల్లెలో మిరప పంటలో చేపట్టవలసిన సమగ్ర యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిరప పంటలో తెల్లదోమ నివారణకు పసుపురంగు జిగురు అట్టలు, వెస్ట్రన్ నల్ల తామర పురుగుకు బులుగు రంగు అట్టలు ఎకరాకు 40 అట్టలు వాడటం వల్ల ఆకుముడత లేదా కుకుంబర యోజాయిస్ వైరస్‌లు రాకుండా అరికట్టవచ్చునని ఆయన తెలిపారు. అలాగే 1 లీటరు నీటికి వేపనూనె 3 ఎంఎల్ వాడటం వల్ల పిల్లిపురుగులు, వాటి గ్రుడ్లు పొదగకుండా ఆపవచ్చునన్నారు.

గురుకుల పాఠశాల తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న న్యాయమూర్తి బాబా ఫక్రుద్దీన్

కడప రూరల్ : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబాఫక్రుద్దీన్ మంగళవారం స్థానిక చిన్నచౌకులోని ఏపీ గిరిజన బాలికల సంక్షేమ పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాలలోని వంట గదులు, వసతి గదులు, తరగతి గదులను పరిశీలించారు. మధ్యాహ్న సమయంలో విద్యార్థులకు అందుతున్న భోజన సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు అభ్యసించే అంశాలపై ఆరా తీశారు. అలాగే రిజిష్టర్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పిల్లల విద్య, ఆరోగ్య విషయాల పట్ల సిబ్బంది తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఏవైనా సమస్యలు ఉంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ దృష్టికి తీసుకు రావాలని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో పూజలు

కడప కల్చరల్ : కడప నగరం శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం భక్తులు దోష నివారణ కోసం రాహుకాల పూజలను నిర్వహించారు. తొలుత అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సామూహికంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు పూజా విధానాన్ని తెలుపుతూ కార్యక్రమాన్ని నిర్వహింపజేశారు. భక్తులు అమ్మవారికి నిమ్మకాయ దీపాలను వెలిగించి మొక్కుకున్నారు.



రాహుకాల పూజలు నిర్వహిస్తున్న భక్తులు

టీడీపీ నుంచి టీడీపీలోకే చేరుతున్నారు

చెన్నూరు : స్థానిక లక్ష్మీనగర్, సరస్వతి నగర్ కాలనీలలో కమలాపురం టీడీపీ ఇంచార్జి పుత్తా నరసింహారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం జరిగిన బాబు షూరిటీ..భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీకి చెందినవారు ఎవరు తెలుగుదేశం పార్టీలో చేరలేదని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జీఎన్ భాస్కర్‌రెడ్డి మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో తెలిపారు. తెలుగుదేశం పార్టీ వారే మళ్లీ తెలుగుదేశం పార్టీలోకి ఆ పార్టీ కండువాలు కప్పుకుని రెన్యువల్ చేసుకోవడం తప్ప, వైసీపీ నుంచి సభ్యత్వం కలిగిన ఒక్క కార్యకర్త కూడా చేరలేదన్నారు. రజకుడు వెంకటయ్య మాట్లాడుతూ అక్కడ ఏమి జరుగుతుందో చూడటానికి వెళ్లానే తప్ప పార్టీలో చేరినట్లు టీడీపీ నాయకులు తెలపడం బాధాకరం అన్నారు. నా కుటుంబాన్ని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి అన్ని విధాల ఆదుకున్నారన్నారు. సమావేశంలో ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ మైనార్టీ కన్వీనర్ అన్వర్‌బాషా వైఎస్సార్‌సీపార్టీ నాయకులు పాల్గొన్నారు.

బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



ప్రధానమంత్రి సురక్ష బీమా చెక్కును అందజేస్తున్న రీజనల్ మేనేజర్ పురుషోత్తంరెడ్డి

వీరపునాయునిపల్లె : ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు అందిస్తున్న ప్రభుత్వ బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఏపీజీబీ రీజనల్ మేనేజర్ పురుషోత్తంరెడ్డి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు శాఖను ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. బ్యాంకులో ఖాతా ఉన్న ప్రతి ఒక్కరూ బీమా చేయించుకోవాలన్నారు. అలా చేసుకోవడం వలన ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ప్రస్తుతం వీరపునాయునిపల్లె శాఖ 109 కోట్ల రూపాయలతో లావాదేవీలు నిర్వహిస్తోందన్నారు. రూ.68 కోట్లు రుణాలు అందించామన్నారు. రూ.48 కోట్లు డిపాజిట్లు సేకరించామన్నారు. డిపాజిట్లపై అత్యధిక వడ్డీ అందిస్తోందని ఈ అవకాశాన్ని ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ఇటీవల ప్రమాదానికి గురైన అనిమెల గ్రామానికి చెందిన జెర్రి అనిల్, బత్తల హరీష్ కుటుంబ సభ్యులకు ప్రధానమంత్రి సురక్ష బీమా పథకం ద్వారా వారి కుటుంబ సభ్యులకు ఒకొక్కరికి రూ.2లక్షలు చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో వీరపునాయునిపల్లె శాఖ మేనేజర్ రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత పశు వైద్య శిబిరం

రాజంపేట రూరల్ : పారుడు వ్యాధి నివారణ టీకా కార్యక్రమంలో భాగంగా ఉచిత పశు వైద్య శిబిరాన్ని అత్తిరాల పశు వైద్యాధికారిణి భాగ్యవతి ఆధ్వర్యంలో మండల పరిధిలోని మందరం ఎస్టీ కాలనీలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉప సంచాలకులు డాక్టర్ వై.విజయబాస్కర్‌రావు మేకలు, గొర్రెలకు టీకాలు వేశారు. అనంతరం రైతులకు పశు ఆరోగ్య సంరక్షణ కార్డులను పంపిణీ చేశారు. అదే విధంగా పాడి రైతులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 246 మేకలకు పారుడు వ్యాధి టీకాలు వేశామని తెలియజేశారు. 300 పైగా గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులను అందజేయడం జరిగిందన్నారు. 308 పైగా మేకలు, పాడి పశువులకు పిడుదల మందులు అందించామన్నారు. కార్యక్రమంలో ఏహెచ్ఏ విద్యాసాగర్, పశు వైద్య సహాయకులు పాల్గొన్నారు.



మేకకు టీకా వేస్తున్న అధికారి